ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
నిర్మల్
జిల్లా వార్తలు
6
శుక్రవారం 5 సెప్టెంబరు 2025





భజనలు చేస్తున్న హత్తిగణేష్ మండలి సభ్యులు

వినాయకా.. సెలవిక

వైభవంగా గణనాథుల నిమజ్జనోత్సవం

గణపతి మొప్ప మోరియా నినాదాలు, డప్పుల దరువులు.. డీజేల హోరు... బాణసంచా వెలుగులు... చిన్నా పెద్దా చిందులు, మహిళల కోలాటాలతో భైంసా పట్టణం ఆధ్యాత్మిక సాగరంగా మారింది. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా వినాయక నిమజ్జనోత్సవం కమనీయంగా కొనసాగింది. చవితి రోజున మండపాల్లో కొలువు దీరి పూజలు అందుకున్న బొజ్జ గణపయ్య గురువారం నిమజ్జనానికి బయలుదేరగా భైంసా పట్టణమంతా భక్తిపారవశ్యంతో ఆనంద తాండవమాడింది. భక్తిశ్రద్ధల మధ్య గంగమ్మ ఒడికి చేర్చారు.



గడ్డెన్న వాగు ప్రాజెక్టులో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం





భైంసాలో నిమజనోత్సవ పూజలో కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే పాటిల్, సబ్‌కలెక్టర్ తదితరులు



బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ జానకీ శర్మిల



అప్రమత్తంగా ఉన్న మహిళా పోలీసులు



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

- కనులపండువగా భైంసాలో శోభాయాత్ర
- భారీగా తరలివచ్చిన భక్తజనం
- భక్తుల సేవలో తరించిన సంఘాలు, సంస్థలు

భైంసా, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భక్తుల కోలహాలం మధ్య పూజలందుకున్న వినాయక విగ్రహాలకు గురువారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి శోభయాత్రకు తరలించారు. గణేష్‌నగర్ కాలనీ మున్నురుకాపు సంఘం, గోపాలకృష్ణ మందిర్‌లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు కలెక్టర్ అభిలాష అభినవ్, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఏఎస్పీ అవినాష్‌కుమార్, హిందూ ఉత్సవసమితి అధ్యక్షులు పెండెపు కాశీనాథ్‌లతో పాటు ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులు, గణేష్ మండలీల సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి శోభయాత్రను ప్రారంభించారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టులో పలుకాలనీల నుంచి వినాయక విగ్రహాలకు నిమజ్జనం నిర్వహించారు. పురాణబజార్ ప్రాంతంలో హిందువాహిని ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి విగ్రహాలకు స్వాగత కార్యక్రమాలు నిర్వహించారు.

కొనసాగుతున్న ఆనవాయితీ

దశాబ్దాలకాలంగా అరే మరాఠా సంఘం, రాజస్థానీ యువమంచ్, శ్రీ లక్ష్మీ నరసింహ యోగ్‌గ్రూప్, మున్సిపల్ కాంప్లెక్స్ బాలాజీ గోపాల్ స్వీట్‌హోమ్, బాలాజీ సూత్రావే కుటుంబసభ్యులు, కిసాన్‌గల్లిలోని పలు యువజన సంఘాలు అన్నదానాలు నిర్వహిస్తున్నారు. పలు మైనార్టీ సంఘాలు కూరగాయాల మార్కెట్ ప్రాంతంలో తాగునీటి వసతిని కల్పిస్తున్నారు. ఇక ఆర్యవైశ్య మహిళా మండలి, విశ్వ బ్రహ్మణ సంఘ మహిళా సభ్యులు వేడుకల్లో కోలాటాలు వేస్తూ ప్రత్యేకంగా నిలుస్తున్నారు. భట్టిగల్లి మున్నూరుకాపు సంఘం శ్రేణులు అతిథులకు సన్మానించడం, ప్రముఖులకు సన్మానించి జ్ఞాపికలను బహూకరించడం అనవాయితీగా కొనసాగుతోంది.

పోలీసు బందోబస్తు

నిమజ్జనోత్సవ శోభా యాత్ర ఆద్యాంతం పోలీసుల నిఘానీడలో కొనసాగింది. పట్టణ పరిధిలో 65 సీసీ కెమెరాలు ఉండగా నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకొని అదనంగా 60 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎస్పీ జానకీ షర్మిల భైంసాలోనే మకాం వేసి భద్రతాచర్యలను పర్యవేక్షించారు. ఏఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో సీఐ గోపినాథ్, ఎస్ఐలు నవనీత్ రెడ్డి, సుప్రియ, నాగభూషణం బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. బందోబస్తు విధుల్లో ఇద్దరు అదనపు ఎస్పీలు, ఒక అడ్మిన్ ఏఎస్పీ, 12 మంది సీఐలు, 22 మంది ఎస్ఐలతో కలిపి 600 మంది ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, సివిల్ కానిస్టేబుళ్లు, హోంగార్డులు, స్పెషల్ పార్టీ పోలీసులు, మహిళా కానిస్టేబుళ్లు, బాంబు డిస్పోజల్ టీం, డాగ్ స్క్వాడ్ టీం పాల్గొన్నారు. పట్టణాన్ని 2 జోన్లుగా, 7 సెక్టారులుగా విభజించి భద్రతా చర్యలు చేపట్టారు. 15 పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేశారు. వీటితో పాటు 4 పెట్రోలింగ్ టీంలు నిరంతరం పర్యవేక్షణ జరిపాయి. ద్విచక్ర వాహనాల పెట్రోలింగ్ టీంలు, ఫుట్ పెట్రోలింగ్ టీంలు రౌండ్ ది క్లాక్ పర్యటనలు జరుపుతూ బందోబస్తు విధులు చేపట్టాయి. 30 రూఫ్ టాప్ బృందాలు భవనాలపై భాగం నుంచి నిరంతరం వీడియో కెమోరాల ద్వారా శోభాయాత్ర చిత్రీకరణ చేపడుతూ బందోబస్తు విధులు చేపట్టాయి. డ్రోన్ కెమెరాలు నిఘా నిరంతరం కొనసాగింది.

అప్రమత్తంగా విద్యుత్‌శాఖ

భైంసాలో గురువారం నిర్వహించిన వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవ ప్రక్రియలో విద్యుత్ శాఖ అద్యాంతం అప్రమత్తంగా వ్యవహరించింది. భైంసా పట్టణ పరిధిలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకుగాను విద్యుత్ శాఖ వేడుకలు ప్రారంభమైన నాటి నుంచి జాగరుకతతో వ్యవహరించింది.

సంప్రదాయాలకు దర్పణం..



తోపుడు బండిలో గణపయ్య

భైంసా నాయి బ్రహ్మణ కాలనీ పరిధిలో నాయి బ్రహ్మణులు హత్తి గణేష్ మండలి పేరిట వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. హత్తి గణేష్ మండలీ ఎలాంటి హంగు, అర్భాటాలకు తావులేకుండా సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహిస్తూ ప్రత్యేకంగా నిలుస్తోంది. 105 సంవత్సరాల కాలంగా ఏనుగు ఆకారంలోని తోపుడు బండినే వినియోగిస్తున్నారు.



శోభాయాత్రలో యువకుల నృత్యాలు



సందడిగా గణపతికి వీడ్కోలు పలుకుతున్న భక్తులు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- **బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

లక్ష్మణచాంద/దిలావర్‌పూర్/సారంగాపూర్/నర్సాపూర్(జి) సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఎస్సీ కాలనీలకు 5 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించినట్లు, అభివృద్ధికి కృషి చేస్తానని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ నిధుల ద్వారా ఆయా గ్రామాల్లోని ఎస్సీ కానీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

దిలావర్‌పూర్ : దిలావర్‌పూర్ మండలాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతానని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే మండలంలో సుడిగాలి పర్యటన చేసి పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సిర్గాపూర్‌లో రూ. 35 లక్షలతో ఎస్సీ కాలనీలో నూతన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాన చేశారు. గ్రామంలోని కురుమ సంఘం భవనానికి భూమి పూజ చేశారు. సాంగ్విలో రూ. 3 కోట్లతో ఆర్ అండ్ బి నిధులతో దిలావర్‌పూర్ మండలం సాంగ్వి నుంచి సోన్ మండలం సిద్దులకుంట గ్రామం వరకు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 20 లక్షలతో సాంగ్విలో పీహెచ్‌సీ హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. బన్సపల్లిలో రూ, 35 లక్షల నిధులతో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సముందర్‌పల్లిలో రూ. 30 లక్షలతో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన బీజేపీ సీనియర్ నాయకులు వి.సత్యనారాయణ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు అయిండ్ల నర్సారెడ్డి, మాజీ జడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, సీనియర్ నాయకులు ముత్యం రెడ్డి, సత్యం చంద్రకాంత్, వీరేష్, నరేష్ రెడ్డి, రాజేష్ రెడ్డి, ఆమెడ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

సారంగాపూర్ : నిర్మల్ నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల అభివృద్ధి పనుల కోసం నిధులను మం జూరు చేయించినట్లు బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అభివృద్ధి నిర్మాణ పనుల కోసం రూ. 4కోట్ల 45లక్షల నిధులను మంజూరు అయినట్లు, ఈ నిధులతో సారంగాపూర్ మండలంలో గల దుప్య తండా నుండి బంద్రేవ్ తండా వరకు రూ. కోటి 15లక్షల, మామడ మండలంలో గల కిషన్‌రావు నుండి జైరామ్ తండా వరకు రూ. 80లక్షలు, మేడిపల్లి నుండి శాంతినగర్ తండా వరకు రూ. 2కోట్లు, లక్ష్మణచందా మండలం పార్పెల్లి నుండి పార్పెల్లి తండా వరకు రూ. 50లక్షల నిధులతో రోడ్డు నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. దీంతో గిరిజన గ్రామాలన్నీ అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.



నర్సాపూర్(జి)లో బీటీరోడ్డు నిర్మాణపనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నర్సాపూర్(జి) : మండలంలోని కుస్లి గ్రామం నుండి ప్రేమ్ నగర్ తండా వరకు రూ. 1.20 కోట్ల నిధులతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో ప్రతి గ్రామం, మారుమూల తండాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలు, రోడ్లను ఆయన పరిశీలించారు. రైతుల నష్టాన్ని అంచనా వేసి వారికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మండల పరిషత్ మాజీ అధ్యక్షులు వి. సత్యనారాయణ గౌడ్, ముత్యం రెడ్డి, నరేందర్, రాజేందర్, అర్జున్, ప్రవీణ్ పటేల్, మహిపాల్, భూమన్న, గంగాధర్, సుధాకర్, దత్తురాంతో పాటు ఇతర మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాలను దర్శించుకున్న కలెక్టర్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు



పూజలు చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో ఏర్పాటుచేసిన గణేశుడిని కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారందర్శించుకున్నారు. గణేశుడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గణేష్ మండప నిర్వాహకులు కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి, మెమొంటోలను అందజేశారు. పూజారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నిర్మల్ పట్టణంలో వినాయక శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. వినాయకుడి నిమజ్జనం సజావుగా సాగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని అన్నారు. అనంతరం సమీపంలో గల రాధాకృష్ణ మందిరంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, తహసీల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తానూర్ : మండలంలోని బోసి గ్రామంలో మహాదేవుని ఆలయంలో కొలువైన శ్రీ వరసిద్ధి కర్ర వినాయకున్ని గురువారం కలెక్టర్ అభిలాష అభినవ్ దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి కర్ర వినాయకున్ని చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్ర వినాయకున్ని దర్శించుకోవడం చాలా సంతోషం కలిగించిందన్నారు. గత 62 సంవత్సరాల నుంచి కర్ర వినాయకున్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించి తదనంతరం నిమజ్జనం చేయకుండా నీళ్ల చల్లి భద్రపరిచి ప్రతి సంవత్సరం అదే కర్ర వినాయకున్ని ప్రతిష్ఠించిడం పర్యావరణ పరిరక్షకులుగా బోసి గ్రామస్తులు నిలుస్తున్నారు. ఒకే గ్రామం ఒకే గణపతి ప్రతిష్ఠించడం అభినందించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, భైంసా డిప్యూటీ కలెక్టర్ అజ్మీరా సంకేత్, ఆనంద్‌రావు పటేల్, తాజా మాజీ జెడ్పీటీవైస్ చైర్మన్ సాగరబాయిరాజన్న, ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఉత్తం బాలేరావు, వీడీసీ కమిటీ అధ్యక్షులు బాలాజీ , నాయకులు, అధికారులు గ్రామప్రజలు పాల్గొన్నారు. బుధవారం శ్రీ వరసిద్ధి వినాయకునికి 108 రకాల నైవేద్యాలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

నిర్మల్ నుంచి తిరుపతి, అరుణాచలం బస్సు

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ నుంచి ఈ నెల 16వ తేదీ మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి బస్సు 17వ తేదీ ఉదయం 6 గంటలకు తిరుపతి చేరుకుంటుందని డిపోమేనేజర్ కే.పండరి తెలిపారు. ఈ సందర్భంగా డిపోమేనేజర్ మాట్లాడుతూ... దిగువ తిరుపతిలో శ్రీనివాస కాంప్లెక్స్‌లో సర్వ దర్శనం టికెట్లు తీసుకొని వారు ఇచ్చిన టైమ్‌లో శ్రీవారి దర్శనం చేసుకోవచ్చునని, టికెట్‌లో ఉన్న టైమ్ లోపల దిగువ తిరుపతిలో గోవిందరాజుల దర్శనం, పద్మావతి అమ్మవారి దర్శనం చేసుకొని తిరుమల చేరుకొని స్వామివారిని దర్శించుకొని తెల్లవారి 18వ తేదీ రోజు ఉదయం 6 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి కాణిపాకం వరాహ సిద్ధి వినాయక టెంపుల్ దర్శించుకొని, తమిళనాడులోని తిరువన్నమలై అరుణాచలేశ్వరుని దర్శనం గిరి ప్రదక్షిణ చేసుకొని తిరిగి నిర్మల్ చేరుకుంటుందన్నారు. 5 రోజుల యాత్ర ఉంటుందని, ఒకరికి రూ. 6,300లు పోను, రాను కలిపి ఉంటుందన్నారు. వివరాలకు 995922 6003, 8328021517, 7382842582లో సంప్రదించాలని ఆయన కోరారు.

పరీక్షలకు సన్నద్ధం కావాలి

- **జిల్లా విద్యాశాఖ అధికారి డి.భోజన్న**



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : 10వ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే పరీక్షలకు సన్నద్ధం కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి. భోజన్న అన్నారు. మండలంలోని కొండాపూర్ నందు గల ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మొదటగా ప్రాథమిక పాఠశాల కొండాపూర్ నందు విద్యార్థులలో తొలిమెట్టు కౌశలాలను పరిశీలించారు. గ్రంథాలయ పీరియడ్‌ను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులు చక్కగా పఠనం అలవాటు చేసుకోవాలని, విద్యార్థుల్లో తొలిమెట్టు నైపుణ్యాలు అభివృద్ధి పరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా ఉన్నత పాఠశాల కొండాపూర్ నందు పదవ తరగతి విద్యార్థుల తరగతి గదికి వెళ్లి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులు ఖచ్చితమైన సమయసారిణి ఏర్పరచుకొని, ప్రత్యేక ప్రణాళికతో అభ్యాసం కొనసాగించాలని సూచించారు. వ్యవసాయ పనులు, సెల్ ఫోన్లు, టీవీలు మొదలగు వాటికి దూరంగా ఉండి, విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి ఫలితాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ ఆధ్యాపకుడికి ఉత్తమ పురస్కారం



డాక్టర్ నామాని రాకేష్

బాసర, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక పురస్కారానికి ఆర్జీయూకేటీలో బాసర ఆధ్యాపకుడు ఎంపికయ్యాడు. ఆర్జీయూకేటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న డా.నామాని రాకేష్ ఈ పురస్కారానికి ఎంపికయ్యాడు. కాగా ఆయనను ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్‌డీ మురళీదర్శన్, వివిధ విభాగాల అధిపతులు, ఆధ్యాపకులు అభినందించారు.

వరద నష్ట నివారణకు తక్షణ సాయం

- **రూ.10 కోట్లు మంజూరు**

భైంసా, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత నెల కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదల మూలంగా జరిగిన నష్టానికి తక్షణ సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి మంగళవారం విపత్తుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రూ.10 కోట్ల నిధులను వరదల మూలంగా దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, కల్వర్టుల తక్షణ మరమ్మత్తులకు, తాగునీటి సరఫరా పరంగా ఏర్పడిన అవాంతరాలను సరిచేసేందుకు మాత్రమే వినియోగించాలని ఉత్తర్వులో స్పష్టం చేసింది. సంబంధిత నిధులను ఇతర ఏలాంటి పనులకు వినియోగించరాదని ఉత్తర్వులో పేర్కొంది.రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ (ఎస్‌డీఆర్ఎఫ్) నిబంధనల మేరకు నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. ప్రభుత్వం తక్షణ సాయం కింద మంజూరు చేసిన నిధులతో జిల్లాలో వరదలతో దెబ్బతిన్న రోడ్లు,వంతెనలు, కల్వర్టుల మరమ్మత్తులకు మార్గం సుగమమైంది. గత నెలలో వరదల మూలంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురవ్వడం, కల్వర్టులు, వంతెనలు దెబ్బతినడం జరిగింది. కొన్ని ప్రాంతాల్లో పరిస్థితులు ప్రమాదకర స్థితికి చేరుకున్నాయి. వాహనాల రాకపోకలకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయడం ఎంతో ప్రయోజనకరంగా మారింది. తక్షణమే మరమ్మత్తు పనులు చేపట్టాలని ఉత్తర్వులో పేర్కొనడం ప్రభావిత ప్రాంతాలకు ఉపశమనం కలిగించింది.

'పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా మోదీ పాలన'

ఖానాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పేదప్రజల సంక్షేమమే ధ్యేయంగా మోదీ పాలన సాగుతోందని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నాడు కాంగ్రెస్ హయాంలో పేదలపై పన్నుల భారాన్ని మోపితే నేడు ప్రధాని నరేంద్ర మోదీ ఆ పన్నుల భారం నుంచి ఉపశమనం కలిగించారన్నారు. తాజాగా జీఎస్టీ తగ్గింపు నిర్ణయంతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు నేరుగా లాభం చేకూరుతుందని రితేష్ రాథోడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ జీఎస్టీ తగ్గింపుతో నిరుపేదల అభ్యున్నతికి మోదీ ప్రభుత్వం ఎంతటి నిబద్ధతతో ఉందో అర్థమవుతుందన్నారు. సెప్టెంబరు 22వ తేదీ నుంచి అమలులోకి వచ్చే నూతన జీఎస్టీ రిఫార్మ్ దసరా, బతుకమ్మ పండుగలకు ప్రతి పేద కుటుంబానికి ప్రధాన మంత్రి ఇచ్చిన కానుకగా ఆయన అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సామాన్యుడి రోజువారి అవసరాలు, ఆరోగ్య రంగానికి భారీ ఊరట లభించిందని కొనియాడారు. వ్యవసాయ కోత యంత్రాలు, విత్తనాలు, పరికరాలపై 12 శాతం నుండి ఐదు శాతానికి జీఎస్టీ తగ్గించడం ద్వారా వ్యవసాయ రంగంలో ఖర్చులు తగ్గి ఉత్పత్తి పెరిగేలా మోదీ నిర్ణయం తీసుకున్నారన్నారు. విద్యాపరమైన ఖర్చులు తగ్గేలా రూపకల్పన చేశారన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జోగు రామన్న

రైతులకు అండగా నిలవాలి: మాజీ మంత్రి

ఆదిలాబాద్‌టౌన్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా, బ్యాంకులు రుణాలు అందించేలా చూడాలని మాజీ మంత్రి జోగురామన్న కలెక్టర్ రాజర్షిషాను కోరారు. ఈవిషయమై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పంటలపై వ్యవసాయాధికారులతో సమగ్రసర్వే నిర్వహించి నష్టపోయిన ప్రతీరైతును ఆదుకోవాలని కోరారు. ఆర్‌ఎఫ్‌ఆర్ భూములను సాగుచేస్తున్న ఆదివాసీ రైతులకు తెలంగాణ గ్రామీణబ్యాంకు మినహా ఇతర బ్యాంకులు రుణాలివ్వడం లేదని వివరించారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. సాత్నాల మండలంలోని మాంగోర్ల, దేవిజిగూడ కు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఆదిలాబాద్ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు. కాంగ్రెస్ పాలనలో గ్రామాలు సమస్యలతో సతమతమవుతున్నాయన్నారు. జీపీలకు నిధులు రాక అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. ప్రధానిమోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ ఏ ఎన్నికలు వచ్చినా బీజేపీని గెలవాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్, పోతరాజు రమేష్, సురేష్, రోహిదాస్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

బోథ్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామంలో శబరిమాత ఆలయ అభివృద్ధికి రూ.10 లక్షల మంజూరు చేయాలని గ్రామస్థులు గురువారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేంద్రను కలిసి విన్నవించారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరలో అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని, గ్రామస్థులు ఒక హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జి.రాజుయాదవ్, గ్రామస్థులు మునిగల ఎల్లయ్య, పెద్దకాపు జనార్ధన్, వీడీసీ అధ్యక్షుడు నల్ల చిన్నయ్య, రవియాదవ్, మునిగేల రమేష్, కుమ్మరి భోజన, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారికి సన్మానం

నిర్మల్ రూరల్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాధికారిగా నియమితులైన దర్శనం భోజన్నను గురువారం జిల్లా ట్రస్మాసంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సమావేశంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ అబ్బాస్, టౌన్ ప్రెసిడెంట్ శ్రీధర్, టౌన్ సెక్రటరీ శ్యామ్, జిల్లా ట్రస్మా సభ్యులు ఎల్లయ్య, జయరాజ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు తీసుకున్న దర్శనం భోజన్న, ఎఫ్ఏవో జ్ఞానేశ్వర్‌లను నిర్మల్ జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు భూసారం గంగాధర్, రాజరత్నంతోపాటు సంఘ కార్యవర్గ సభ్యులు సన్మానించారు.

అటవీ ప్రాంత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

» ఐరన్ బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే



ఐరన్ బ్రిడ్జి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్, అటవీశాఖ అధికారులు

ఉట్నూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ నియోజకవర్గంలోని అటవీ ప్రాంత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేయడానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ కృషి చేస్తున్నారు. కవ్వాల్ టైగర్ ప్రాంతంలోని గ్రామాలకు వెళ్లే రహదారులకు ఉన్న వాగుల పై వంతెనలు నిర్మించడానికి అటవీ శాఖ అడ్డంకులు వస్తుండడంతో గురువారం ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రంసక్కుతో కలిసి తిర్యాణి మండలంలో నిర్మించిన ఐరన్ బ్రిడ్జిలను పరిశీలించారు. ఉట్నూర్ మండలం నర్సపూర్‌జే, లంకతుమ్మ వాగుపై, పెంబి మండలం అటవి ప్రాంతాల్లో గుమెన ఎంగ్లాపూర్, రాంనగర్ యాపలగూడ గ్రామాల ప్రజలు అనేక శతాబ్దాల నుంచి రోడ్లు వంతెనలు లేకపోవడంతో ఇబ్బందులకు గురి అవుతున్నారని భావించిన ఎమ్మెల్యే ఐరన్ బ్రిడ్జిల నిర్మాణంతో సమస్యలు పరిష్కరించాలని భావిస్తున్నారు. దీంతో తాత్కాలిక ఐరన్ బ్రిడ్జి నిర్మాణం చేయాలనే ఆలోచనతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు, అటవి అధికారులతో కలిసి ఆసిఫాబాద్ నియోజక వర్గంలోని తిర్యాని మండలం, గాడెలపల్లి గ్రామ పంచాయతీలోని అటవీ ప్రాంతంలో వాగుమీద తాత్కాలికంగా నిర్మించిన ఐరన్ బ్రిడ్జిని అధికారులతో కలిసి పరిశీలించామని తెలిపారు. ఇలాంటి తాత్కాలిక ఐరన్ బ్రిడ్జిలను ఖానాపూర్ నియోజక వర్గంలో కూడా అటవీ ప్రాంతంలో గ్రామాలలోని వాగులపై ఏర్పాటు చేస్తే ప్రజలను ఇబ్బందుల నుంచి కాపాడవచ్చని భావిస్తున్నామన్నారు. అటవీ శాఖ అనుమతులు, నిర్మాణ పనులకు అవసరమయ్యే ప్రతిపాదనలు తయారు చేయాలన అధికారులను ఆయన కోరారు. అదేవిధంగా కరెంట్ లేక మిద్దెచింత, రాగిదుబ్బ, ధర్మాజిపేట గ్రామాలు ఇంకా చీకటిలో ఉన్నాయని అలాంటి గ్రామాలలో కరెంట్ సమస్య పరిష్కరించడానికి తిర్యాని అటవీ ప్రాంతంలో ఉండే కరెంట్ లైన్ లాగా అటవి గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడం కోసం విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వీలైనంత త్వరగా అటవీ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి మేలు జరిగేలా చేస్తామని బొజ్జుపటేల్ తెలిపారు. ఈ పర్యటనలో ఉట్నూర్ పంచాయతీ రాజ్‌శాఖ డిప్యూటీ ఈఈ పవార్‌రమేష్, ఏఈ పంచాయతీ రాజ్ బీర్సాయిపేట్ ఎఫ్ఆర్‌ఓ అరుణ, పెంబి ఎఫ్ఆర్‌ఓ రమేష్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అనిల్‌గౌడ్, గోపాల్, తిర్యాణి, అటవి శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం

ఉట్నూర్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్వయం పరిపాలన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి వివిధ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్‌లో..

బజార్‌హత్నూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కురుక్షేత్ర టాలెంట్ స్కూల్‌లలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని గురువారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయుల సేవలను ప్రధానోపాధ్యాయురాలు కౌసల్య, నవీన్‌లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్ శేఖర్, గౌతమి, చంపత్, నవనీత, సాహితి, పూజలు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకెళ్లాలి



పరిశీలిస్తున్న సంక్షేమ అధికారి నిర్మల

కుబీర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ముందుకు తమ లక్ష్యాన్ని ఎంచుకోవాలని, ఆ లక్ష్య సాధనకు ప్రణాళితో ముందుకెళ్లాలని గిరిజన ఆశ్రమ పాఠశాల సంక్షేమ అధికారి మెస్రమ్ నిర్మల అన్నారు. గురువారం సీఆర్‌టీలతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు గడువులోపు పాఠ్యాంశాలను పూర్తి చేసి వెనక బడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పరిశీలించి రుచికరంగా వండాలని సూచించారు. సీఆర్‌టీ భూమేష్, లక్ష్మీ, సవిత, రవి, తదితరులున్నారు.

దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

» మాజీ జడ్పీటీసీ గణేష్‌రెడ్డి



భూమిపూజ చేస్తున్న గణేష్‌రెడ్డి

తలమడుగు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో నూతనంగా నిర్మించే శబరిమాత ఆశ్రమానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, బొల్లారపు బాబన్నలు మాట్లాడారు. ఆశ్రమం శిథిలావస్థలో ఉండటంతో రూ.10 లక్షల ప్రభుత్వ నిధులతో భవనాన్ని ఆరునెల లోపే నిర్మించి భక్తులకు అందజేస్తామని గోక గణేష్‌రెడ్డి తెలిపారు. అనంతరం శబరిమాత భక్తులు గ్రామస్తులు గణేష్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, గ్రామపెద్దలు, శబరిమాత ఆలయ కమిటీ అధ్యక్షులు మోతి రాజమల్లు ఉన్నారు.

వ్యాధుల విజృంభణ

(5వ పేజీ తరువాయి)

జూన్ మాసాన్ని మలేరియా మాసంగా వైద్యఆరోగ్యశాఖ పరిగణిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటుంది. దీంతో మలేరియా కొంత అదుపులోనే కన్పిస్తోంది. ఇప్పటివరకు జిల్లాలో 2 మలేరియా కేసులు మాత్రమే నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే వైరల్ ఫీవర్స్, టైఫాయిడ్, డయేరియా కేసులు అధికంగా పెరిగిపోతున్నాయి. చలిజ్వరం, ఒళ్లు నొప్పులతో జనంవణికి పోతున్నారు. శీతల గాలులతో జలుబు, జ్వరం దగ్గులాంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కొత్త నీరురావడంతో పిల్లల్లో గొంతు, ముక్కు సంబంధిత వ్యాధులు కన్పిస్తున్నాయి. పెద్దలు జ్వరంతో మంచం పడుతున్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు రిమ్స్ ఆసుపత్రిలో ఓపీ భారీగా పెరుగుతుంది. గత నెల రోజుల క్రితం రిమ్స్ ఆసుపత్రిలో 2వేల వరకు నిత్యం ఓపీ ఉండగా ప్రస్తుతం 2600 నుంచి 2800 వరకు ఓపీ ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే ఇన్‌పేషెంట్ 800 నుంచి 1000 వరకు ఉంటున్నట్లు తెలుస్తోంది

ఎటు చూసినా చెత్తాచెదారమే..

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎటు చూసినా చెత్తా చెదారమే కన్పిస్తోంది. ముసురు వర్షాలతో పారిశుధ్య పనులు ముందుకు సాగడం లేదు. దీంతో పరిసర ప్రాంతాలు కంపుకొడుతు ఈగలు, దోమల బెడద విపరీతంగా పెరిగిపోతోంది. మేజర్ గ్రామ పంచాయతీలైన ఇచ్చోడ, తలమడుగు, నేరడిగొండ, ఉట్నూర్, బోథ్, గుడిహత్నూర్, బేల మండలాల్లో పారిశుధ్య నిర్వాహణ మరి అధ్వానంగా కన్పిస్తోంది. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక ఎక్కడ వేసిన చెత్తఅక్కడే అన్నట్లుగా మారింది. ఇలాంటి పరిస్థితులతో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గత 15 రోజులుగా కురుస్తున్న భారీవర్షాల కారణంగా జిల్లాలో పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రమేష్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లాలో 18 మండలాల్లో మక్క, సోయా, వరి, పత్తి పంటలు నష్టపోవడం జరిగిందని, వెంటనే ప్రభుత్వం రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

'మహాకర్మయోగి అభియాన్‌ను విజయవంతం చేయాలి'

బోథ్, సెప్టెంబరు4 (అంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధికి నోచుకోని గ్రామాల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు మహాకర్మయోగి అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సోనాల ఎంపీడీవో రవీందర్ కోరారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రభుత్వ విభాగాల అధికారులకు ప్రణాళిక ప్రకారం పనిచేయాలని సూచించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలఅభివృద్ధికి పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ లెవెల్ మాస్టర్ ట్రైనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన కార్మికులకు చీరల పంపిణీ

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఈద్‌గాంలో మధ్యాహ్న భోజన వంట సిబ్బంది, స్కావెంజర్‌కు చీరలను పంపిణీ చేసినట్లు ఉపాధ్యాయుడు ఏ.మునిందర్ రాజు, నిర్మలదేవి దంపతులు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నందుకు వారిని అభినందించేందుకు చీరలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజ రాణి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్‌రావు, వెంకటేశ్వర్‌రావు, సిద్ధికి, కృష్ణ, కుమార్, రాజు, వివేక్, స్వాతి, ఉజ్వల, శ్రీజ పాల్గొన్నారు.



తురాటిలో ఎడ్లబండిపై వెళ్తున్న గణనాథుడు



బ్రహ్మన్‌గాంలో వినాయకుడి శోభాయాత్ర



కుంటాలలో గణేషుడి శోభాయాత్రలో..

భక్తిశ్రద్ధలతో గణనాథులకు వీడ్కోలు

ముథోల్, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మన్‌గాం, గన్నోర, బోరిగాం, వడ్తాల్ గ్రామాల్లో గురువారం గణేష్ నిమజ్జనోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోలాటాలు, బాజాభజంత్రీలతో శోభాయాత్ర చేపట్టారు. ముథోల్ సీఐ మల్లేష్ నేతృత్వంలో ఎస్సై బిట్ల పెర్సెస్, సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

సాంప్రదాయ పద్ధతిలో..

కుంటాల: కుంటాలతోపాటు పెంచికల్‌పాడ్, కల్లూరు గ్రామాల్లో సంప్రదాయ పద్ధతిలో వినాయక నిమజ్జనాన్ని నిర్వహించారు. డీజేలు, బ్యాండుమేళాలకు భిన్నంగా కుంటాలతోపాటు పెంచికల్‌పాడ్ గ్రామాలలో గ్రామస్థులు, యువకులు భజనలు చేస్తూ వినాయక శోభాయాత్రను నిర్వహించారు. సమీప చెరువులో నిమజ్జనం చేశారు.

లక్ష్మణచాంద: మండలంలోని ఆయా గ్రామాల్లో గణేష్ నిమజ్జనోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయా గణేష్ మండపాల యువకులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నారు.



భజన చేస్తూ నిమజ్జనానికి వెళ్తున్న భక్తులు

ఎడ్లబండిపై శోభాయాత్ర

నర్సాపూర్(జి): మండలంలోని తురాటి గ్రామంలో గణేష్ నిమజ్జనం పర్యావరణహితంగా సాగింది. ఎడ్ల బండిపై ఊరేగిస్తూ శోభాయాత్రగా వెళ్లడం అందరినీ ఆకట్టుకుంది. గ్రామ పెద్దలు, యువకులు కలిసి వాహనాలను, డీజేలను పక్కన పెట్టి సంప్రదాయ ఎడ్లబండిని అలంకరించి గణేశుడిని ఊరేగించారు. 'వహనాలు వద్దు రా.. ఎడ్లబండి ముద్దురా' అనే నినాదంతో పర్యావరణ పరిరక్షణకు ఒక గొప్ప సందేశాన్నిచ్చారు. గ్రామస్థులంతా తమ సంస్కృతిని, ప్రకృతిని గౌరవించాలనే స్ఫూర్తిని చాటి చెప్పారు.

దిలావర్‌పూర్: మండలంలోని న్యూ లోలంలో సంప్రదాయ రీతిలో బొజ్జ గణపయ్యను నిమజ్జనం చేశారు. గ్రామానికి చెందిన రాక్‌స్టార్ యూత్ సభ్యులు గణపతి నవరాత్రులను సంస్కృతి, సంప్రదా యం ఉట్టి పడేలా ఆధ్యాత్మిక వైభవం చా టారు. డీజే సౌండ్, సినిమా పాటలు లేకుండా కేవల ం కోలాటం, జానపదంలో రంగరించిన భక్తిభావంతో కూడిన పాటలతో గణపయ్య శోభాయాత్ర నిర్వహించారు. దీంతో రాక్ స్టార్ యూత్ సభ్యులను గ్రామస్థులు ప్రశంసించారు.

వేలంలో లడ్డును దక్కించుకున్న ముస్లిం



షేక్ మహబూబ్‌కు లడ్డును అందజేస్తున్న గ్రామస్థులు

కుంటాల, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో గురువారం నిర్వహించిన లడ్డు వేలంలో ఓ ముస్లిం లడ్డును దక్కించుకున్నాడు. గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ 2 కేజీల లడ్డును రూ.1100లకు దక్కించుకున్నాడు. దీంతో గ్రామస్థులు ఆయనను అభినందించి సన్మానించి లడ్డును అందజేశారు. కుల మతాలకు అతీతంగా వినాయక చవితి శోభాయాత్ర నిర్వహిస్తుంటామని గ్రామస్థులు పేర్కొన్నారు.

డ్రాలో ముస్లింకు వరించిన లడ్డు

లక్ష్మణచాంద, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన సయ్యద్ హుస్సేన్‌కు డ్రాలో గణేష్ వరించింది. గణేష్ నిమజ్జనం సందర్భంగా సంబంధిత రాక్స్‌యూత్ సభ్యులు లక్కీ డ్రా గురువారం నిర్వహించారు. ఈ లక్కీ డ్రాలో సయ్యద్ హుస్సేన్ పేరు రావటంతో ఆ లడ్డును నాయకులు మేడిపెల్లి గంగాధర్ చేతుల మీదుగా ఆయనకు అందజేశారు. దేవుడికి ఎలాంటి మత భేదం లేదని దీని ద్వారా నిరూపితమైందని పలువురు పేర్కొన్నారు. కుల, మత భావనలు పక్కకు పెట్టి వఅందరూ ఐక్యంగా ఉండాలని గ్రామస్థులు కోరారు.



జీఎంఏ సభలో జనార్ధన్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

జీఎంఏ సభకు ఖానాపూర్‌వాసులు

ఖానాపూర్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో బుధవారం నిర్వహించిన గ్లోబల్ మున్నూరు కాపు అసోసియేషన్ (జీఎంఏ) సభకు ఖానాపూర్‌కు చెందిన జనార్ధన్, చింతపండు వేణుగోపాల్‌లు హాజరైనట్లు వారు గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్ ద్వారా తెలిపారు. జీఎంఏ ఫౌండర్ రంజిత్, వెంకట్ పెద్ది ఆధ్వర్యంలో ప్రపంచంలోని ఏడు ఖండాలలో గల మున్నూరు కాపులను ఏకం చేయాలనే ఉద్దేశ్యంతో గ్లోబల్ మున్నూరు కాపు అసోసియేషన్ సభను నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. వాషింగ్టన్ డీసీలో నిర్వహించిన ఈ జీఎంఏ సభకు తెలంగాణ నుండి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఆస్కార్ అవార్డు విన్నర్ చంద్రబోస్, మాజీ ఎమ్మెల్యే చందర్, తెలంగాణ మున్నూరు కాపు సంగం అధ్యక్షులు కొండ దేవయ్యలు హాజరయ్యారని పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తలమడుగు, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్లి(కె) గ్రామానికి చెందిన ఎల్పుల లక్ష్మయ్య (47) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తలమడుగు ఎస్ఐ రాధిక తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని అర్లి(కె) గ్రామానికి ఎరుపుల లస్మయ్య వృత్తి రీత్యా ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. తీవ్ర మనోవేదన గురైన లక్ష్మయ్య గురువారం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతునికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

వరదలో కొట్టుకుపోయిన వ్యక్తి మృతి

నార్నూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని మలంగి ఎస్సీ గూడకి చెందిన ఝాడే శంకర్ (41) వరదలో కొట్టుకుపోయి మృతి చెందినట్లు నార్నూర్ ఎస్సై కె. అఖిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు బుధవారం తన పంట పొలం దగ్గర పనులు చేసి సాయంత్రం ఇంటి తిరుగు ప్రయాణం వచ్చే సమయం ఊరి దగ్గరలో ఉన్న వాగు దాటుతుండగా ఒక్క సారి భారీగా వరద రావడంతో కొట్టుకుపోయి మృతి చెందినట్లుగా తెలిపారు. మృతునికి భార్య పిల్లలు ఉన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

కుంటాల, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): కుంటాలలోని శాంతినికేతన్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు చేసిన కృషి, అంకిత భావానికి గౌరవంగా ప్రతీ ఏడాది సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటారని, భారత దేశ రెండవ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జరుగుతుందని ప్రిన్సిపాల్ సంతోష్ అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

దీక్ష కళాశాలలో..

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దీక్ష జూనియర్ కళావాలలో గురువారం గరుపూజోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. వెంకట్ రెడ్డి తెలిపారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్పతనాన్ని, ఆయన ఉపాధ్యాయులకు ఎందుకు మార్గదర్శకులు అనే దానిపై విద్యార్థులకు వివరించారు. అనంతరం అధ్యాపకులను కళాశాల యాజమాన్యం శాలువా, మెమొంటోతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రమోద్ రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం

» మధ్యాహ్న భోజన పథకం యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సులోచన



సమావేశంలో మాట్లాడుతున్న సులోచన

ఖానాపూర్, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్నభోజన పథకం యూనియన్ నిరంతర పోరాటాన్ని కొనసాగిస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సులోచన అన్నారు. ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ గ్రామంలో గురువారం సీఎం రావు గార్డెన్‌లో నిర్వహించిన మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నిర్మల్ జిల్లా రెండో మహాసభలను ఆమె సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు గంగామణిలతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలను పెంచాలన్నారు. పాఠశాలలకు అన్ని రకాల వస్తువులను ప్రభుత్వమే ఇస్తూ కార్మికులకు నెలకు రూ. 10 వేల వేతనాన్ని ఇవ్వాలన్నారు. యూనిఫామ్, ఐడీ కార్డ్ సౌకర్యం కల్పించడంతో పాటు 60ఏళ్ల పైబడిన మధ్యాహ్న భోజన కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.2లక్షలు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఆ హామీని నెరవేర్చాలని చేశారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

మధ్యాహ్న భోజన సంఘం యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా గంగామణి, అధ్యక్షురాలిగా బొడ్డు గోదావరి, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మీ, సత్యవ్వ, గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా కే. రాధ, సహాయ కార్యదర్శులుగా రేణుక, రాజవ్వ, లక్ష్మీ, రాజేశ్వర్, కోశాధికారిగా వందనలు ఎన్నికయ్యారు.

కాలువలో పడి బాలుడి మృతి



మృతిచెందిన బాలుడు (ఫైల్)

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్లారెడ్డిపేటకు చెందిన బత్తుల జయరాజ్ (12) బుధవారం కాలువలో పడి మృతిచెందినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలుడి మానసిక స్థితి బాగాలేదని, బాలుడిని తన తల్లి కూలీ పనులకు తోడుగా తీసుకొని బుధవారం తీసుకెళ్లింది. వారందరూ మధ్యాహ్నం కలిసి భోజనం చేసిన తర్వాత జయరాజ్ ప్రమాదవశాత్తు ఆడుకుంటూ కాలువలో పడిపోయి మరణించాడని తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం భర్త మరణించడం, ఇప్పుడు కుమారుడు మరణించడంతో తల్లి రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

వాట్సాప్ చాట్‌తో ఫిర్యాదులు, సేవలు పొందే సదుపాయం

» ఆదిలాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జేఆర్ చౌహాన్


జేఆర్ చౌహాన్

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీజీఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతికతను వినియోగంలోకి తీసుకొచ్చి వాట్సాప్ చాట్ ద్వారా విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, సేవలు పొందే సదుపాయాన్ని కల్పించినట్లు ఆదిలాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జేఆర్ చౌహాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికతను సద్వినియోగం చేసుకుని వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, సమయాన్ని ఆదా చేయడం, పారదర్శకతను కాపాడడం ఈ చాట్ బాట్ ప్రత్యేకత అని అన్నారు.వినియోగదారులు వా ట్సాప్‌లో 7901628348కు హాయ్ అని పంపాలన్నారు. వెంటనే వెల్‌కంటూ టీజీఎన్‌పీడీసీఎల్ కాల్ సెంటర్ అని సందేశం అందుతుందని తెలిపారు. వెంటనే రిజిస్టర్ కంప్లైంట్, ట్రాక్ కంప్లైంట్, చాట్ విత్ ఏజెంట్ ఆప్షన్లు వస్తాయన్నారు. వినియోగదారు యూనిక్‌సర్వీస్ నెంబర్ ఎంటర్ చేస్తే వెంటనే ఆ విద్యుత్ సర్వీస్ వివరాలు ప్రదర్శించబడతాయన్నారు. వివరాలను ఒకే చేసిన తర్వాత కంప్లైంట్‌కు సంబంధించిన విభాగాల మెను కనిపిస్తుందని తెలిపారు. వినియోగదారు తాను ఎదుర్కొంటున్న సమస్యను ఎంచుకుని ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చు లేదా నేరుగా ఏజెంట్‌తో చాట్ చేయవచ్చు అన్నారు. కంప్లైంట్ నమోదైన వెంటనే ప్రత్యేక కంప్లైంట్ ఐడీ సృష్టించబడతుందని, ఆ వివరాలు వినియోగదారునికి ఎస్ఎంఎస్ రూపంలో అందుతాయని పేర్కొన్నారు. ఫిర్యాదు సంబంధిత అధికారికి పంపడం జరుగుతుందని, వినియోగదారు ఎప్పుడైనా కంప్లైంట్ ఐడీ ద్వారా తన సమస్య పురోగతిని ట్రాక్ చేసుకోవచ్చని తెలిపారు. సమస్య పరిష్కారం అయిన వెంటనే వినియోగదారునికి ఐవీఆర్ఎస్ కాల్ వస్తుందన్నారు. వినియోగదారు సంతృప్తి చెందనట్లయితే అదే కంప్లైంట్‌ను మళ్లీ రీఓపెన్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అదనంగా టోల్ ఫ్రీ నెంబర్ 1 912 ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేయవచ్చన్నారు. ఈ కొత్త సదుపాయం ద్వారా వినియోగదారులకు మరింత వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందే అవకాశం ఉందని పేర్కొన్నారు.

మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు సిద్ధం అవుతున్న అధికారులు


ఉట్నూర్‌లో మండల పరిషత్ ఎన్నికల సామగ్రి సిద్ధం చేస్తున్న అధికారులు

ఉట్నూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్,జిల్లా పరిషత్ ఎన్నికల కోసం అధికార యంత్రం సిద్ధం అవుతుం ది. మండల ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం సభ్యు ల ఓటర్ల జాబితాలను ఆయా మండల పరిషత్ అభివృద్ధి అధికారుల ఆధ్వర్యంలో సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 6న మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గం ఓటరు జాబితాలను అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించడంతో ఉట్నూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాంప్రసాద్, మండల పంచాయతీ అధికారి సుధీర్‌రెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం ఓటరు జాబితాలను సిద్ధం చేశారు, ఉ ట్నూరు మండలంలో పులిమడుగు ఎంపీటీసీ పరిధిలో పులిమడుగు, చింత కర్ర, జమూలతండా, సాకేర బి పంచాయతీలు, నర్సాపూర్ బి ఎంపీటీసీ పరిధిలో నర్సాపూర్ బి, జైత్రం తండా పంచాయతీలు, సాలెవాడా బి, ఎంపీటీసీ పరిధిలో సాలెవాడా బి, బాబాపూర్, తంద్రా, సాలెవాడా కె, వడగల్పూర్ కె పంచాయతీలు, షాంపూర్‌ఎంపీటీసీ పరిధిలో షాంపూర్, ఏంద్రా, కుమ్మరి తండా పంచాయతీలు, ఉమ్రి ఎంపీటీసీ పరిధిలో ఉమ్రి, నడ్డంగూడ పంచాయతీలు, చాందూరి ఎంపీటీసీ పరిధిలో చాందోరి, మారుగుడా, శ్యాం నాయక్ తండా పంచాయతీలు,హస్నాపూర్, ఎంపీటీసీ పరిధిలో హస్నాపూర్ పంచాయతీ, నాగ్‌పూర్ ఎంపీటీసీ పరిధిలో నాగ్‌పూర్, టక్కుగూడ, లింగోజి తండా పంచాయతీలు,ఉట్నూర్ వన్ ఎంపీటీసీ పరిధిలో ఉట్నూరు పట్టణంలోని ఒకటి, రెండు, మూడు, నా లుగు, వార్డులు, ఉట్నూర్ 2 ఎంపీటీసీ పరిధిలో 5,6,7,8 వార్డులు, ఉట్నూర్3 ఎంపీటీసీ పరిధిలో 9,10,11, 12,13 వార్డులు, ఎంపీటీసీ 4 పరిధిలో 14,15, 16,17,18 వార్డులు, లక్కారం వన్ ఎంపీటీసీ పరిధిలో ఒకటి, రెండు,మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు వార్డులు, లక్కారం 2 ఎంపీటీసీ పరిధిలో 8,9,10, 11,12,13,14 వార్డులు, ఘన్పూర్ ఎంపీటీసీ పరిధిలో ఘన్పూర్, మత్తడిగూడా పంచాయతీలు, గంగాపూర్ ఎంపీటీసీ పరిధిలో గంగాపూర్, కన్నాపూర్,లక్కెటిపేట, కామాయిపేట గ్రామ పంచాయతీలు, దంతనపల్లి ఎంపీటీసీ పరిధిలో దంతనపల్లి, చెరువు గూడెం, దొంగచింత, గోండు గూడాజి పంచాయతీలు బీర్సాయిపేట ఎంపీటీసీ పరిధిలో బీరుసాయిపేట, హీరాపూర్ జె, నర్సాపూర్ జె పంచాయతీలకు సంబంధించిన ఓట ర్లు ఎంపీటీసీలను ఎన్నుకుంటారు. అదేవిధంగా మండలంలోని 18 గ్రామ పం చాయతీల పరిధిలో ఉన్న ఓటర్లు జడ్పీటీసీ అభ్యర్థిని ఎన్నుకునేలా ఓటరు లిస్టులు తయారు చేశారని అధికారులు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్

కడెం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నవాబ్‌పేట్, కడెం పెద్దూర్, లింగాపూర్ జీపీలలో ఇందిరమ్మ ఇళ్ల క్లస్టర్ స్థాయి సమావేశాలు నిర్వహించారు. అన్ని గ్రామాల ప్రజలు ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడెం తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, ఏఈ హౌసింగ్, ఏపీఎం ఐకేపీ, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల రోడ్లకు మహర్దశ

» ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
» స్వగ్రామం సేవాదాస్ నగర్ బిడ్జి నిర్మాణానికి సైతం శ్రీకారం
» బోథ్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా రాబోయే రోజుల్లో బోథ్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా
» ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చొరవతో నియోజకవర్గ రోడ్ల అభివృద్ధికి రూ.13.24 కోట్లు మంజూరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట మేరకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గిరిజన శాఖ జీవో నం.240 ద్వారా నియోజకవర్గంలోని మారుమూల గిరిజన ప్రాంతాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.13.24 కోట్లు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా నేరడిగొండ మండలంలోని గౌలిగూడ గ్రామానికి రూ.1.10 కోట్లు, బర్కపల్లి గ్రామానికి రూ. 57 లక్షలు, సేవాదాస్‌నగర్ హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 3.35 కోట్లు, నారాయణపూర్ గ్రామానికి రూ.20 లక్షలు, తాంసి మండలంలోని వడ్డాడి నుంచి తాంసి వరకు 87 లక్షలు, తాంసి నుంచి కుచులాపూర్ వరకు రూ. 1.20 కోట్లు, పొన్నారి నుంచి కప్పర్ల రూ.1.50 కోట్లు, జామిడి నుంచి సావర్గావ్ రూ. 1.80 కోట్లు, బండల నాగాపూర్ నుంచి వడ్డాడికి రూ. 2.65 కోట్లు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చడానికి కష్టపడతానని ప్రజలకు సౌకర్యాలు కల్పించడానికి ఎమ్మెల్యే అయ్యానని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం గతంలో సైతం రోడ్లు చేయించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని ముందు ముందు కూడా నియోజకవర్గానికి రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి కృషి చేస్తానని అన్నారు.

మార్కెట్‌లో మరో ట్రెండ్

» నిర్మల్ జిల్లాలో జోరుగా ఫ్రెండ్షిప్ గాజుల పండుగ
» గాజులు, గోరింటాకులను అలంకరించుకుంటూ సందడి చేస్తున్న మహిళలు



ఖానాపూర్‌లో వినాయక మండపం వద్ద ఫ్రెండ్షిప్ గాజులు వేసుకుంటున్న మహిళలు

ఖానాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం మార్కెట్‌లో మరో కొత్త రకమైన ట్రెండ్‌కు మహిళలు శ్రీకారం చుట్టారు. ఫ్రెండ్షిప్ గాజుల పండుగ పేరిట గత వారం రోజులుగా జిల్లాలో పలువురు మహిళలు సందడి చేస్తున్నారు. ఈ పండుగలో ప్రధానంగా ఒక ప్రాంతానికి చెందిన మహిళలంతా కలిసి ఓ ఆలయం వద్దనో లేదా ప్రస్తుతం కొనసాగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో వినాయక మండపాల వద్దకో వెళ్తున్నారు. అక్కడ సదరు బృందంలోని స్నేహితులు ఒకరికొకరు గాజులు వేసుకోవడం, గోరింటాకు పెట్టుకోవడం లాంటివి చేస్తున్నారు. మరికొన్ని చోట్ల మహిళలంతా కలిసి ఏకంగా వన భోజనాలకే వెళ్తూ ఉదయం నుండి సాయంత్రం వరకు సరదాగా గడుపుతూ ఈ ఫ్రెండ్షిప్ గాజుల పండుగను నిర్వహించుకుంటున్నారు. ఇంటి పనుల్లో బిజీగా గడిపే తాము ఈ గాజుల పండుగతో ఒక్క రోజైనా మిత్రులతో కలిసి ఉపశమనం పొందుతున్నామని పలువురు మహిళలు చెబుతున్నారు. కాగా మార్కెట్‌లోకి వచ్చిన ఈ నయా టెండ్రను ఫాలో అయ్యేందుకు పలువురు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. ఈ కొత్తరకం ట్రెండ్‌తో మార్కెట్‌లో ప్రస్తుతం గాజులకు, గోరింటాకుకు జోరుగా గిరాకీ పెరిగిందని చెబుతున్నారు. ఏ లేడీస్ ఎంపోరియంలో చూసినా మహిళల సందడి కనిపిస్తోంది.

క్రమశిక్షణతో చదివితేనే లక్ష్యాలను సాధించొచ్చు


విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

ఖానాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో చదివితేనే భవిష్యత్తులో ప్రతిఒక్కరూ తమ లక్ష్యాలను సాధిస్తారని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్ రావు అన్నారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉత్తమ హాజరు శాతం కనబరిచిన విద్యార్థులందరికీ ప్రోత్సాహకంగా ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఉచితంగా నోట్‌పుస్తకాలు, పెన్నులు తదితర విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఇటీవల భారీవర్షాలు కురిసినప్పటికీ నిహారిక, ఫాతిమా, నవీఙ్న, నందిత, ప్రజ్ఞస్య, చందన, వర్షిత్, రహీం, గురునాథ్, వంశీ, నివేదిత, వందన, రిషిత, చంద్రకాంత్, సాయిశ్రీలు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఉత్తమ హాజరు శాతం కనబరిచిన విద్యార్థులందరినీ అభినందించారు. చదువును కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుర్ర శేఖర్, వెన్నం అంజయ్య, షేక్ ఇమ్రాన్ ఉన్నారు.

సీజనల్ వ్యాధుల విజృంభణతో

కిక్కిరిసిపోతున్న ఏరియా ఆస్పత్రి

» సౌకర్యాల లేమిని అధిగమిస్తూ వైద్య సిబ్బంది సేవలు
» ఒక్కో పడకపై ఇద్దరేసి రోగులకు చికిత్సలు


ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ ముందు కిక్కిరిసిపోయిన రోగులు


భైంసా ఏరియా ఆసుపత్రిలో ఒక పడకపై ఇద్దరు చిన్నారులకు వైద్య సేవలు

భైంసా, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల మూలంగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో సీజనల్ వ్యాధుల బెడద పెరిగింది. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అన్ని వయస్సుల వారు రోగాల బారిన పడి సతమతమవుతున్నారు. ఈ క్రమంలో డివిజన్ వాసులకు పెద్దదిక్కుగానున్న భైంసా ఏరియా ఆసుపత్రికి రోగులు క్యూ కడుతున్నారు. దీంతోఆసుపత్రిలోని అన్ని విభాగాలు చికిత్సలు కొసం వస్తున్న బాధితులతో కిక్కిరిసిపోతున్నాయి. రోగుల సంఖ్య అధికంగా ఉండటంతో ఆసుపత్రిలోని పడకలు సరిపోవడం లేదు. వసతులు, సౌకర్యాల లేమితో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికి ఆస్పత్రి వైద్యాధికారులు, సిబ్బంది వసతులు, సౌకర్యాల లేమిని అధిగమిస్తూ ఆదర్శవంతమైన రీతిలో రోగులకు సేవలు అందిస్తూ మార్గదర్శకంగా నిలుస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఒక్కో పడకపై ఇద్దరేసి రోగులకు పడుకోబెట్టి చికిత్సలు అందిస్తున్నారు. బెంచీలపై సైతం సదుపాయం కల్పిస్తూ వైద్యం అందిస్తున్నారు. అత్యవసర విభాగంలో చేరుతున్న రోగులకు వసతులు, సౌకర్యాల లేమి నెలకొన్నప్పటికి వాటిని అధిగమిస్తూ వైద్య సేవలు అందిస్తూ వారు వ్యాధుల బారి నుంచి కోలుకునేలా చికిత్సలు నిర్వహిస్తున్నారు. బుధవారం భైంసా ఏరియా ఆస్పత్రిలో 697 మంది చికిత్సల కోసం తరలివచ్చారంటే వ్యాధుల బెడద ఏ విధంగా ఉందో చెప్పకుండానే తెలిసిపోతోంది.

మూషికాల దెబ్బకు మూలన పడ్డ శకటం

» ఖానాపూర్‌లో అగ్నిమాపక శకటం వైరింగ్‌ను కొరికేసిన ఎలుకలు
» స్థానికంగా రిపేర్ కాదని హైదరాబాద్ తరలించాలంటున్న టెక్నీషియన్స్
» నెల రోజులుగా కదలని ఖానాపూర్ అగ్నిమాపక శకటం
» ప్రస్తుతానికి ఆర్మూర్ ఫైర్ ఇంజన్‌తో నెట్టుకొస్తున్నవైనం


ఎలుకలు వైరింగ్‌ను కొరికేయడంతో నెల రోజులుగా మూలన పడి ఉన్న ఖానాపూర్ ఫైర్ ఇంజన్

ఖానాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'ఎలుక ఎలుక ఎంత పనిచేశావ్ అంటే... తన పని తనంతో ఏకంగా అగ్నిమాపక యంత్రాన్నే మూలన పడేసే అంత' అన్నట్లుగా ఖానాపూర్‌లో పరిస్థితి తలెత్తింది. ఖానాపూర్‌లో కేవలం తాత్కాలిక ప్రభుత్వ భవనంలో కొనసాగుతున్న ఫైర్ స్టేషన్‌లో కనీసం సౌకర్యాలు లేవు. అగ్నిమాపక శకటం నిలిపేందుకు సైతం కనీసం వాహన షెడ్డు లేదు. ప్రస్తుతం ఫైర్ స్టేషన్ నిర్వహిస్తున్న భవనం చుట్టూ గోడౌన్లు ఉండడంతో ఇక్క విపరీతంగా ఎలుకలు ఉన్నాయని ఫైర్ స్టేషన్ అధికారులు, సిబ్బంది చెబుతున్నారు. ఈ ఎలుకలు ఎంత పని చేశాయంటే ఖానాపూర్‌కు చెందిన ఏపీ 28 టీఈ 8448 అనే నెంబర్ గల అగ్నిమాపక యంత్రం లోపలి భాగాలలో చొరబడి దాని వైరింగ్ మొత్తం కొరికేశాయి. దీంతో ప్రస్తుతం ఆ వాహనం కదలలేని పరిస్థితికి చేరుకుంది. వాహనానికి రిపేర్ చేయించేందుకు నిజామాబాద్ నుంచి టెక్నీషియన్స్‌ను పిలిపించారు. అయినా అది కదిలే పరిస్థితి లేకపోవడంతో ఇక చేసేదేమీ లేక వాహనాన్ని హైదరాబాద్ తరలించాల్సిందేనని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ వాహనం 13 ఏళ్లకు పైబడిగా నడుస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఖానాపూర్‌కు ఈ పురాతన వాహనాన్ని తప్పించి నూతన వాహనాన్ని మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా ఎలుకల బారిన పడి దెబ్బతిన్న ఈ అగ్నిమాపక శకటానికి మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు స్థానిక ఇన్‌చార్జి ఫైర్ అధికారి సయ్యద్ జావెద్ అలీ చెబుతున్నారు. మొత్తానికి ఎలుకలు ఖానాపూర్‌లో ఫైర్ ఇంజన్‌ని కదలకుండా చేసి వాటి సత్తా ఏంటో చాటుకున్నాయని అటుగా వచ్చి వాహనాన్ని చూసిన వారంతా ముక్కున వేలేసుకుంటున్నారు. ఇక్కడ మరో విషయం ఏంటంటే నెల రోజులుగా ఈ వాహనం కదలకుండా పడి ఉండడంతో ప్రత్యామ్నాయంగా ఆర్మూర్ నుంచి టీఎస్ 07 యూఏ 3271 అనే ఫైర్ ఇంజన్ వాహనాన్ని తెచ్చి పని వెల్లదీస్తున్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా ఫైర్ ఇంజన్‌ను ఏర్పాటు చేసుకున్నప్పటికి కొత్త ఫైర్ ఇంజన్‌తో పాటు ఫైర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఎలుకల దెబ్బకు మరోసారి ఖానాపూర్‌లో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ తెరపైకి వచ్చింది.

డీజే శబ్దాలతో నలుగురికి అస్వస్థత

● చికిత్స కోసం ఆస్పత్రికి తరలింపు


అస్వస్థతకు గురైన విద్యార్థిని

భైంసా, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గణపతి నవ రాత్రి వేడుకల్లో భాగంగా భైంసా పట్టణంలోని పిప్రి కాలనీలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో డీజే ఉపయోగించడం వల్ల భారీ శబ్దాలను తట్టుకోలేక నలుగురు అస్వస్థతకు గురయ్యారు. వారిలో నిజామాబాద్‌లో డిగ్రీ చదువుతున్న కె.కీర్తి అపస్మారక స్థితికి చేరడంతో ఆస్పత్రికి తరలించారు. రాత్రి పొద్దుపోయాక నిర్వహించిన వేడుకలో మరో ముగ్గురు చిన్నారులు కూడా అస్వస్థతకు గురయ్యారు.

నేడు గొండ్వానలో తుడుందెబ్బ సమావేశం

ఉట్నూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడలో శనివారం ఉదయం 11 నుంచి గొండ్వాన పంచాయతీ రాజ్ భవనంలో ఉమ్మడి జిల్లా సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడం దెబ్బ రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షుడు గొడం గణేష్ ప్రకటించారు. గురువారం ఉట్నూర్ మండల కేం ద్రంలోని కుమురంభీం కాంప్లెక్స్‌లో ఉమ్మడి జిల్లా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నటువంటి ఆదివాసీ 9 తెగల గొండ్వాన పంచాయతీ రాజ్‌సెంటర్ సార్‌మేడిలు, గ్రామపటేల్ దేవరీలు, కుల సంఘాలు, ఆదివాసీ సంఘాల నాయకులు,విద్యార్థులు, యువకులు, మహిళలు అదే విధంగా రాజకీయ పార్టీ నాయకులు, తాజా మాజీ నాయకులందరు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. ప్రతీఒక్కరు ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్కబాపురావు, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూరు పుష్పరాణి, ఆత్రం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మహిళా భక్తులతో కిటకిటలాడుతున్న గణేష్ మండపాలు

» ఆకట్టుకుంటున్న ప్రియదర్శిని నగర్ వినాయకుడి ప్రతిమ


పూజలు చేస్తున్న మహిళా భక్తులు

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని పలుచోట్ల ప్రతిష్టించిన వినాయక విగ్రహాల వద్ద పూజలు నిర్వహించేందుకు మహిళా భక్తులు భారీ సంఖ్యలో బారులు తీరుతున్నారు. స్థానిక ప్రియదర్శిని నగర్‌లో అక్కడి మహిళా భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడికి వివిధ రకాల నైవేద్యాలను సమర్పించారు. అనంతరం ప్రసాద వితరణతో పాటు భక్తిపాటలతో అందరినీ ఆకట్టుకునే విధంగా పూజలు జరిపారు. గత వారం రోజుల నుండి మహిళా భక్తులు ఇక్కడి వినాయకుడి విగ్రహం వద్ద అన్నీ తామై ముందుండి కార్యక్రమాలను నిర్వహిస్తుండడం విశేషం. మేడారం శ్రీలేఖ, నామని సునీతా తదితర మహిళల ఆధ్వర్యంలో ప్రతిరోజు రాత్రి భజన కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నారు. వీరికి నిర్వాహకులు భవాని, మేడారం కళ్యాణ్, అయిత వెంకట రమణ, విష్ణు, తదితరులు తమవంతు సహకారాన్ని అందిస్తున్నారు.

వలకి చిక్కిన 30 కిలోల చేప


30కేజీల చేపను చూపిస్తున్న మత్స్యకారుడు

కుభీర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన సాయినాథ్ అనే మత్స్యకారుడికి గురువారం 30కేజీల బోత్స రకం చేప చిక్కింది. మండల కేంద్రంలో జరిగే గురువారం వారసంతలో చేపలు విక్రయించేందుకు మండలంలోని గడ్డెన్న సుద్దవాగు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నిగ్వా గ్రామ సమీపంలో చేపల వేటకు వెళ్లగా 30కేజీల చేప చిక్కిందని తెలిపారు. వారసంతలో విక్రయించారు.

డీజేలను పంపించడంతో నిలిచిపోయిన నిమజ్జనం


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఆత్మ చైర్మన్

బోథ్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని సాయి నగర్ కాలనీలో గురువారం ఉదయం 12 గంటల ప్రాంతంలో గణేష్ నిమజ్జనానికి కాలనీలోని మూడు మండపాలవారు నిమజ్జనానికి ప్రధాన రోడ్డుపైకి చేరుకున్నా రు. అయితే ఇదే సమయంలో కొంతమంది డీజేలను రోడ్డుపై ఉంచి సౌండ్ సిస్టం పెంచి పోటీపడ్డారు. కొంతమంది రోడ్డుపైనే నిలబడి నృత్యాలు చేస్తుండటంతో కాలనీకి చెందిన కొంతమంది స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో స్థానిక ఎస్సై శ్రీ సాయి ముందుగా వెళ్లి డీజే లను ఆపి సౌండ్ తగ్గించాలని సూచించారు. దీంతో రెచ్చిపోయిన యువకులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వరరావు సాయి నగర్ కాలనీకి చేరుకొని డీజే రన్ అక్కడనుండి పంపించారు. దీంతో యువకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అయితే సీఐ ప్రభుత్వాన్ని ప్రకారమే డీజేలను వినియోగించాలని అంతేగాక రాత్రి రెండు గంటల లోపే నిమజ్జనం చేయాలని సూచించారు. దీంతో పోలీసులకు స్థానిక యువకులకు వాగ్వాదం మొదలైంది. విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్మ చైర్మన్ జి. రాజు యాదవ్, సహకార సంఘం డైరెక్టర్ ఉమేష్‌లు పోలీసులతో మాట్లాడి సమస్యను సద్దుమణిగేలా చేయడం జరిగింది. యువకులు గణేషను నిమజ్జనానికి తరలించారు.

నిర్మల్ వాసికి అరుదైన గౌరవం


అవార్డు అందుకుంటున్న గొల్లపల్లి మాధవి

నిర్మల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్‌కు చెందిన వశిష్ఠ హైస్కూల్ ప్రిన్సిపాల్ గొల్లపల్లి మాధవికి అరుదైన గౌరవం దక్కింది. 2025-26 సంవత్సరానికి గాను హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేసిన గురుబ్రహ్మ అవార్డుకు మాధవి ఎంపికయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో గొల్లపల్లి మాధవికి ని ర్వాహకులు 2025-26 సంవత్సరానికి గాను గురుబ్రహ్మ అవార్డును అందజేశా రు. విద్యారంగంలో ఉత్తమ సేవలందించే వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తారని, తనకు ఈ అవార్డు దక్కడం ఆనందంగా ఉందని మాధవి పేర్కొన్నారు. గురుబ్రహ్మ అవార్డు పొందిన మాధవిని స్థానికులు అభినందిస్తున్నారు.

జన సురక్ష బీమాపై అవగాహనా సదస్సు

ఉట్నూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాబార్డు, ఉట్నూర్ సహకార బ్యాంకుశాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని తాంద్ర గ్రామపంచాయతీలో నాబార్డు క్షేత్ర సమన్వయ కర్త లోకరామ్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ కిరణ్, ఫీల్డ్‌ఆఫీసర్‌రాజులు జన సురక్ష బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ బ్యాంకులో పొదుపు ఖాతా ఉండాలన్నారు. కేంద్రప్రభుత్వ ప్రధానమంత్రి జనసురక్ష భీమా పథకాలు జీవన జ్యోతిసురక్ష బీమా, అటల్‌పెన్షన్ బీమా యోజన, ప్రధానమంత్రి జన్‌ధన్‌యోజనల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

ఆదిలాబాద్‌టౌన్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు పెన్షన్ పెంచుతామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రేమ్‌రాజ్ ఆరోపించారు. గురువారం రెవెన్యూ గార్డెన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 8న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేష్, వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీస్ నాయకులు కోచ్‌లు, నాందేవ్, కడదరపు పొచన్న, దాసరి అశోక్, తరోడి శంకర్, కనక కిషన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే

బోథ్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో పంట నమోదు డిజిటల్ సర్వే కొనసాగుతోంది. అన్ని గ్రామాల్లో రైతుల సాగు చేస్తున్న పంటల వివరాలను డిజిటల్ సర్వేలో నమోదు చేస్తున్నారు. రైతులు పండించిన పంటపొలాల్లోకి వెళ్లి ఏఈఓ శ్యాంసుందర్‌రెడ్డి నమోదు చేశారు.

- ఎటు చూసినా జ్వరపీడితులే
- జిల్లాలో విజృంభిస్తున్న విషజ్వరాలు
- ఆసుపత్రులకు క్యూ ప్రజలు
- పట్టణం, గ్రామాల్లో అధ్వానంగా పారిశుధ్యం
- అప్రమత్తంగా ఉంటేనే ఆపదలు దూరం


రిమ్స్ ఆసుపత్రిలో ఓపీ వద్ద క్యూకట్టిన జ్వరబాధితులు


ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న జ్వర బాధితులు

వ్యాధుల విజృంభణ

ఆదిలాబాద్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. జ్వరాలతో ప్రజలు వణికిపోతున్నారు. గ్రామాల్లో ఎటు చూసినా జ్వర బాధితులే కనిపిస్తున్నారు. ముఖ్యంగా వైరల్ ఫివర్స్, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ జ్వరాలతో అల్లాడుతున్నారు. గతపక్షం రోజులుగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలకు కలుషిత నీటితో డయేరియా విజృంభించి మంచం పడుతున్నారు. వైద్య అధికారులు ఇంటింటికీ ర్యాపిడ్ ఫివర్‌సర్వేను చేపడుతున్న జ్వరబాధితుల సంఖ్యతగ్గుముఖం పట్టడంలేదు. అలాగే పారిశుధ్య పనులు నిలిచిపోయి పట్టణం, పల్లె పరిసరప్రాంతాలు అధ్వానంగా మారుతున్నాయి. ప్రధానంగా ఏజెన్సీ మారుమూల గ్రామాలలో పరిస్థితులు దారుణంగా కనిపిస్తున్నాయి.

జిల్లాలో 145 హైరిస్క్‌గ్రామాలు

జిల్లాలో 145 హైరిస్క్ గ్రామాలతోపాటు మున్సిపాలిటీ పరిధిలోని 55 ఏరియాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవడంతో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికీ కొన్ని ఏజెన్సీ గ్రామాలు వ్యవసాయ బావుల పైననే ఆధారపడి దాహం తీర్చుకుంటున్నాయి. ఈ యేడు వానాకాల సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 3లక్షల 79వేల 190 మందికి అధికారులు వైద్యపరీక్షలు నిర్వహించగా ఇందులో 865 మంది విషజ్వరాల బారిన పడినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. అలాగే డెంగ్యూ పాజిటివ్ కేసులు 80, మలేరియా 2, డయేరియా 120 కేసులు నమోదైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈలెక్క మరింత ఎక్కువగానే ఉంటుందన్న వాదనలు విన్పిస్తున్నాయి. అధికార యంత్రాంగం అప్రమత్తంగా లేకుంటే సీజనల్ వ్యాధుల ముప్పు తప్పదన్న హెచ్చరికలు వస్తున్నాయి.

భారీగా పెరిగిన ఓపీ

జిల్లా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకోవడం, కురుస్తున్న ముసురు వర్షాలతో సీజనల్ వ్యాధుల బారినపడి జనం ఆసుపత్రులకు క్యూకడుతున్నారు. ప్రతీయేడు (మిగతా 6వ పేజీలో..)

ఇంటింటా ర్యాపిడ్ ఫివర్ సర్వేను చేపడుతున్నాం

• డా.నరేందర్‌రాథోడ్ (డీఎంఅండ్‌హెచ్, ఆదిలాబాద్)



ఇంటింటా ర్యాపిడ్ ఫివర్ సర్వేను చేపడుతున్నాం. పీహెచ్‌సీల పరిధిలో సీజనల్ వ్యాధుల ముప్పుపై అవగాహన కల్పిస్తున్నాం. మలేరియా, డెంగ్యూ, డయేరియా అదుపులోనే ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 989 మంది ఆశావర్కర్లు ఫివర్ సర్వే చేపడుతున్నారు. 13 జన్‌మన్‌టీంలు నిత్యం 3, 4 మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు చేపడుతున్నాం. ఇప్పటివరకు జిల్లాలో విషజ్వరాలతో ఎవరూ మృతి చెందిన దాఖలాల్లేవు. ముఖ్యంగా హైరిస్క్ ఏరియాపై ప్రత్యేకదృష్టి సారిస్తున్నాం. వర్షాకాలంలో అన్నిరకాల జాగ్రత్తలను తీసుకుంటున్నాం.

ఎస్టీ హాస్టల్ విద్యార్థికి డెంగ్యూ

» రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స

బోథ్: బోథ్ మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతిగృహంలో పదోతరగతి విద్యార్థి కాట్లే గౌతమ్‌కు డెంగ్యూ నిర్ధారణఅయ్యింది. తీవ్రజ్వరంతో బాధపడుతుండగా వైద్యపరీక్షలు నిర్వహించగా విద్యార్థికి డెంగ్యూ నిర్ధారణఅయ్యిందని, గౌతమ్‌ను మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రికి పంపించినట్లు హాస్టల్ వార్డెన్ బాలాజీ తెలిపారు.

గిరిజన గ్రామాల రోడ్ల ప్రగతికి రూ.156.52 కోట్లు మంజూరు

» ఖానాపూర్ నియోజకవర్గానికి రూ.28.71కోట్లు

ఉట్నూర్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాలలోని గిరిజన గ్రామాల రోడ్ల ప్రగతికి ప్రభుత్వం రూ.156.52 కోట్లు మంజూరు చేసింది. ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్రంలోని ఉట్నూర్, ఏటూరు నాగారాం, భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ప్రాంతాలలో ఉన్న 203 రోడ్ల అభివృద్ధికి రూ.465.55 కోట్లు మంజూరుచేస్తూ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, కార్యదర్శి అలుగు వర్షిని ఉత్తర్వులు జారీచేశారు. ఆదిలాబాద్ నియోజక వర్గంలోని 14.40కిలో మీటర్ల 7రోడ్ల నిర్మాణానికి రూ.13.12 కోట్లు, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 5.35 కిలోమీటర్లలో ఉన్న 8 రోడ్ల నిర్మాణానికి రూ.9కోట్లు, బెల్లంపల్లి నియోజకవర్గంలో 21.20 కిలోమీటర్లలో ఉన్న 8 రోడ్ల నిర్మాణానికి రూ.23.70 కోట్లు, బోథ్‌నియోజకవర్గంలో 12.10 కిలో మీటర్లలో 9రోడ్ల నిర్మాణానికి రూ.13.24 కోట్లు, చెన్నూర్ నియోజక వర్గంలో 19.60 కిలోమీటర్ల 8రోడ్ల నిర్మాణానికి రూ.21.80 కోట్లు, మంచిర్యాల నియోజకవర్గంలో 12 కిలో మీటర్లలో దండేపల్లిన ఉంచి గుండాల రోడ్డుకు రూ.25 కోట్లు, ముథోల్ నియోజకవర్గంలో 17.60 కిలోమీటర్లు ఉన్న రెండురోడ్ల నిర్మాణానికి రూ.12.50 కోట్లు, నిర్మల్ నియోజకవర్గంలో 2.30 కిలోమీటర్లలో నాలుగు రోడ్ల నిర్మాణానికి రూ.4.45 కోట్లు, సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజక వర్గంలో మూడు కిలో మీటర్లలో రెండు రోడ్ల నిర్మానానికి రూ.5 కోట్లు మంజూరయ్యాయి.

ఖానాపూర్ నియోజకవర్గానికి రూ.28.71కోట్లు: ఎమ్మెల్యే

ఖానాపూర్ నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.28.71కోట్లు మంజూరు చేసిందని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ తెలిపారు. ఇంద్రవెల్లి మండలంలో గట్టెపల్లి నుంచి కోలాంగూడ రోడ్డుకు రూ.3.30కోట్లు, సిరికొండ మండలంలోని సిరికొండ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి దస్రుగూడ రోడ్డుకు రూ.2.6 2కోట్లు, ఉట్నూర్ మండంలోని గొట్టిరోడ్డు నుంచి కోలాంగూడ రోడ్డుకు రూ.1.03 కోట్లు, పంచాయతీరాజ్ రోడ్డు నుంచి రాముగూడ రోడ్డుకు రూ.1.14 కోట్లు, ఉట్నూర్ పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి ప్రదానగుడ రోడ్‌కు రూ.1.14 కోట్లు, సిరికొండ మండలంలోని కన్నాపూర్‌నుంచి కన్నాపూర్ తండారోడ్డుకు రూ.3 కోట్లు, మంజూరు చేయడంతో పాటు జన్నారం, కడెం ప్రాంతాలలో ఉన్న రోడ్ల నిర్మాణం కలుపుకొని నియోజక వర్గానికి రూ.28.71 కోట్లు మంజూరయ్యాయని త్వరలోనే రోడ్ల నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు : ఆడే గజేందర్

నేరడిగొండ, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.13.24 కోట్లు మంజూరు సీఎం రేవంత్‌రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోడ్ల నిర్మాణంతో గిరిజన గ్రామాలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామస్థుల భాగస్వామ్యం అవసరం: ఎంఈవో

జైనథ్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామస్థులు భాగస్వామ్యం అవసరమని జైనథ్ మండల విద్యాశాఖ అధికారి గంగుల శ్రీనివాస్ అన్నారు. గురువారం జైనథ్ మండల కేంద్రంలోగల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం పదోన్నతిపై ఎస్.రాములు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. జైనథ్ ఎంపీపీఎస్‌హెచ్‌ఎం ఎస్.రాములు తన సొంత డబ్బులతో పాఠశాలలో గల 110 మంది విద్యార్థులకు షూలు, సాక్సులను అందజేశారు. కార్యక్రమంలో జైనథ్ మండల రిటైర్డ్ ఎంఈఓ డి.సంపత్‌కుమార్, మాజీ సర్పంచ్ డి.దేవన్న, రిటైర్డ్ ఉపాధ్యాయులు కె.దేవన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలి


అవగాహన కల్పిస్తున్న టీబీ జిల్లా అధికారి సుమలత

నేరడిగొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీబీవ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలనీ టీబీ నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ సుమలత అన్నారు. మండలంలోని వడూర్ గ్రామంలో గురువారం టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డాక్టర్ సుమలత మాట్లాడుతూ టీబీ ఒక బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ అని, ఇది సాధారణంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుందని అన్నారు. దగ్గడం, తుమ్మడం, ఉమ్మివేయడం ద్వారా గాలిలో కలుస్తుందని అన్నారు. టీబీ నిర్ధారణ అయితే భయపడొద్దని, మందులు వాడితే తగ్గిపోతుందని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో పవార్ రవీందర్, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ల్యాబ్ టెక్నీషియన్ దేవిదాస్, ఎక్సరే టెక్నీషియన్ శ్రీనివాస్, ఏఎన్‌ఎం సంగీత, ఆశావర్కర్ తదితరులు ఉన్నారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు సురేష్

బోథ్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్ మైదానంలో ఆనంద్ ఉత్సవ మేళా ఎగ్జిబిషన్‌ను గురువారం ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు సురేష్ వైద్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతానికి ఎగ్జిబిషన్ రావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ క్లబ్ ఉపాధ్యక్షులు ఎల్క రాజు, సూర్య ప్రకాష్ రెడ్డి, కోశాధికారి కొట్టాల రమేష్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మాసం అనిల్‌తో పాటు దివాకర్‌రెడ్డి, మెరుగు నరసింహ, దాస్, మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థినుల ఎంపిక

ఇచ్చోడ, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ విభాగంలో ఆర్.ఐశ్వర్య, జూనియర్ విభాగంలో కె.గాయత్రి ఈనెల 5, 6, 7 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి అసోసియేషన్ యోగా పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపాల్ గీతాంజలి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ లలిత, ఉపాధ్యాయురాలు స్రవంతి పీడీ, సంధ్య పీఈటీ, రాజ్యలక్ష్మి, పీఈటీలు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వినాయకునికి ఐటీడీఏ పీఓ ప్రత్యేక పూజలు


పూజ చేస్తున్న పీఓ ఖుష్బుగుప్తా


లక్కారంలో పూజల చేస్తున్న సీఐ, ఎస్సైలు


కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

ఉట్నూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సమగ్ర గిరిజన సంస్థ కార్యాలయ వసతిగృహాల కాలనీలో ఉన్న మండపాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా గురువారం సందర్శించి గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా మాట్లాడుతూ గణేష్ నవరాత్రులను అందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారని, నిమజ్జనాన్ని ప్రజలు శాంతియుత వాతావరణంలో నిమజ్జనాన్ని జరుపుకోవాలని మండప నిర్వాహకులకు సూచించారు. ఆమెవెంట ఐటీడీఏ ఏవో దామోదర్‌స్వామి, సహాయ కోశాధికారి పవన్‌కుమార్, పీహెచ్‌ఓ సందీప్‌కుమార్, ఏపీఓ పీవీటీజీ మేస్రంమనోహర్, తదితరులు ఉన్నారు.

గణేషునికి పోలీసుల పూజలు

ఉట్నూర్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం అభయాంజనేయ మందిర్‌లో ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్, ఉట్నూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్‌లు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో లక్కారానికి చెందిన సీతాగొంది ఆత్రంగంగాదర్‌రావు, మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, కాంగ్రెస్ నాయకులు కొత్తపల్లి మహేందర్, తదితరులున్నారు.

బోథ్: సోనాల మండలకేంద్రంలోని పలు గణేష్ మండపాలలో గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల పోతన్న, తుల అజయ్‌ల తోపాటు పలువురు ప్రత్యేక పూజలుచేశారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తి చేసుకోవాలని కోరారు.

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలోని పలు గణేష్ మండపాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచుశ్రీకాంత్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో ఆధ్యాత్మిక భావం ఉట్టిపడేలా ఊరేగింపు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మండపం వద్ద కుంకుమ పూజలు

ఉట్నూర్: మండలంలోని చెక్‌పోస్టు కొత్తగూడలోని గణేష్ మండపంలో గురువారం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. పూజారి విజయ్ శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమ పూజలకు మహిళ భక్తులు హాజరై భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బానోత్ జైవంత్‌రావు, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు జాదవ్‌రవినాయక్, గ్రామస్థులు పాల్గొన్నారు.

గణపతి లడ్డును దక్కించుకున్న ఆడే గజేందర్

నేరడిగొండ: మండలంలోని వడూర్‌లో పెద్ద హనుమాన్ ఆలయం వద్ద గురువారం గణేష్ లడ్డు వేలంపాటలో ఆడే గజేందర్ పాల్గొని రూ.25 వేలకు లడ్డును దక్కించుకున్నారు. లడ్డును దక్కించుకోవడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.


సోనాలలో కోలాటం వేస్తున్న గ్రామస్థులు

భక్తిశ్రద్ధలతో గణనాథులకు వీడ్కోలు

బోథ్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోనాలలో గణనాథుని నిమజ్జనం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. డీజేలకు స్వస్తి పలికి కోలాటాలు ముందుకు సాగారు. గ్రామస్థులు తీసుకున్న నిర్ణయాన్ని పలువురు అభినందించారు.

వినాయక నిమజ్జనం శాంతియుతంగా చేసుకోవాలి

నేరడిగొండ, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనాన్ని శాంతియుత వాతావరణంలో చేసుకోవాలని ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండలంలోని కుంటాల (కే) గ్రామంలో పలు మండపాల వద్ద వినాయకుడిని దర్శించుకున్నారు. నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కుంటాల (కే) గ్రామ నాయక్ బిక్కు, గట్టు అశోక్, మార్కండేయ, అర్జున్, రమేష్, కుమ్మరి లింగన్న, సోమేష్, రాజు, రాములు, రవి, మహేష్, శ్రీకాంత్, పాప, కాలీం తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనం రాత్రి 2లోపు పూర్తి చేయాలి

బోథ్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జనాన్ని భక్తులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, రాత్రి 2గంటల లోపు నిమజ్జనం పూర్తి కావాలని సీఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కొంతమంది నిమజ్జనం మధ్యలో ఆపివేసి తిరిగి తెల్లవారి కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని చెప్పారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నందున భక్తులు రాత్రి 2గంటల లోపు నిమజ్జన కార్యక్రమాన్ని ముగించాలని సూచించారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

నేరడిగొండ, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానంపై మండలంలోని వడూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తీసుకున్న నిర్ణయం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నేరడిగొండ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నాయుడి రవి, ఆత్మ డైరెక్టర్ కుంట శంకర్, పాలశంకర్, దరందాస్ మహేందర్, ఉషన్న, తదితరులు ఉన్నారు.

గణపతి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

నేరడిగొండ, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్పూర్‌లో నిర్వహించిన గణపతి పూజలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన భాష్పంద్ మహరాజ్, సూరజ్ మహరాజ్‌లను ఎమ్మెల్యే కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను సన్మానించారు.

సాయిలింగిలో బూరెలతో అన్నప్రసాదం

తలమడుగు, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిలింగి గ్రామంలో గురువారం గణపతి నవరాత్రులను పురస్కరించుకొని మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపతి మండపం వద్ద గ్రామస్థులందరికీ బూరెలతో మహా అన్నదానం పెట్టారు. ఉదయం 8 గంటల సాయంత్రం వరకు ఈ మా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులతో భజన నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


భక్తులకు వడ్డిస్తున్న బూరేల భోజనం

విద్యార్థుల ఉన్నతిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్, పాల్గొన్న ఎమ్మెల్యే, ఇతర అతిథులు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నస్థాయికి ఎదగడంలో ఉపాధ్యాయుల సహకారం ఎంతో ఉంటుందని, వారిసేవలను విద్యార్థులు గుర్తుంచుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని గురువారం జడ్పీ హాల్‌లో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల శంకర్, డీసీసీబీ ఛైర్మన్అడ్డి భోజారెడ్డి, ఐటీడీఏ పీఓ, జిల్లా ఇన్‌చార్జి డీఈఓ ఖుష్బూగుప్తాతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రతీ మనిషి ఉన్నతస్థాయికి ఎదగాలంటే దానికి పునాది, భవిష్యత్తును కాపడటంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. ఒకస్థాయికి చేరాలంటే గురువు తప్పనిసరిగా అవసరమన్నారు. అంత కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తూ సమూల మార్పులను కూడా చేసిందన్నారు. బదిలీలు, పదోన్నతులు, కౌన్సిలింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టిందని గుర్తుచేశారు. ఉపాధ్యాయులు కూడా వారిపై ఉన్న గురుతర బాధ్యతను గుర్తించుకుంటు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం చిన్నారులు చేసిన సంస్కృతిక నృత్యాలను తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన 72 మంది ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లతో పాటు మెమొంటోలను అందించారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, సెక్టోరియల్ అధికారులు రఘు రమణ, ఉదయశ్రీ, సుజాత్ అలీ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మావల: మండలంలోని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అంతకుముందు మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు నర్రా నవీన్, ఉపాధ్యాయులు శ్రీరామ్, నీలమ్మ, శ్రీలత, సునీత, శృతి, యాసమీన్, కిరణ్, కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

ఆదిలాబాద్ టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ అతిక్ బేగం అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అజీమ్ ముద్దీన్ ప్రసంగించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రతీ విద్యార్థి రాబోవు తరానికి స్ఫూర్తిదాయకంగా ఉండాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఘుగణపతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు యాకూబ్ అలీ, పృథ్వీరాజ్, చంద్రకాంత్, అనిత, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.


కేఆర్కే కాలనీ ప్రభుత్వ పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న విద్యార్థిని

ఉపాధ్యాయులుగా విద్యార్థులు

బోథ్: మండలకేంద్రంలో నాగభూషణం పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యాబోధన చేశారు. అలాగే సోనాల మండలంలోని సోనాల గ్రామ వివేకానంద పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణచైతన్య, ఇస్తారి శుద్ధోధన్‌లు ఉన్నారు. మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు విద్యాబోధన చేశారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రిటైర్డ్ మండల విద్యాధికారి రావుల గణపతి, ప్రిన్సిపాల్ పచ్చిపాల సంతోష్ మాట్లాడారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.